# అందని శిఖరాలు

ఏ.వి. సత్యనారాయణ రచన



టైపుచేస్తూనే చేతిగడియారం వంక నిరాశగాచూసాడు ఆనందం. సమయం ఐదు ఘంటలయింది, యింకా బోలెడు లెటర్సు టైపుకావాల్సివున్నది. అన్ని పబ్లిక్ ఆఫీసుల్లోంచి గూళ్ళుచేరే పిట్టల్లాగా అంతా హాయిగా యిళ్ళు చేరుకోబోతుంటే 'యముడి' గారి పుణ్యమా అని పంజరంలో చిలకల్లాగా తాము టైపులు కొట్టుకుంటున్నారు. ఆనందం ఆ రోజు పదవసారి తాను స్టెనోగ్రాఫర్ వుద్యోగంలో చేరడమే జీవితంలో చేసిన పెద్ద పొరపాటను కున్నాడు.

స్కూలునుండి వచ్చి యిట్లో పిల్లలేం బీభత్సం చేస్తున్నారోనని రాధాదేవి, టాంకు బండు దగ్గర మధు తనకోసం ఎంత ఎదురు చూస్తూన్నాడోనని మిస్ సూర్య ఓ వైపు ఆత్రపడుతూనే మరో వైపు విసుక్కుంటూ స్టెన్సిల్స్ కట్ చేస్తున్నారు. 'యముడి' పని కాబట్టి తప్పులు పోకుండా జాగ్రత్త పడుతున్నారు. ఈ మధ్యనే జాయినయిన రాధేశ్యాం, మహమూద్ లు ఒళ్ళు దగ్గర పెట్టుకుని 'స్టేట్ మెంటులు' కట్ చేస్తున్నారు. టైపురూంలో వాతావరణం టక్ టక్ ల శబ్దంతో ఫాక్టరీని తలపిస్తున్నది.

అటెండర్లు కట్ అయిన స్టెన్సిల్సు వెంటదివెంట జాయింట్ మేనేజింగ్ డైరక్టర్ (జే.యం.డి.) గారి గదిలోకి తీసుకొస్తున్నారు. జే.యం.డి. ఓ వైపు ఫైళ్ళుచూస్తూ వుంటే ఆయ నెదురుగా కూర్చుని ఇద్దరు డీ.యం.డీలు, ఓ టెక్నికల్ ఆఫీసరు స్టెన్సిల్స్ టెక్స్టుతో కంపేర్ చేస్తున్నారు.

"మనల్ని బలేక్లర్కుల్ని చేసాడయ్యా యీ అగ్గిబరాటాగాడు. వీడు వచ్చిన్నాటి నుండి నెలకు నాల్గుసార్లన్నా యీ బాడ్ఖవ్ చాకిరీ తప్పడంలేదు. వీడు కాన్ఫరెన్సుల్లో చదివే పేపర్లూ రిపోర్టులు మనమా కంపేర్ చేయాలి?! ఛా. గాండూ కార్పొరేషనై పోయింది" అంటూ సాంకేతిక భాషలో తిట్టిపోస్తున్నాడు టెక్నికల్ ఆఫీసరు శ్రీనివాసరావు.

జే.యం.డీ. ఆగమయ్య చిరునవ్వుతో వింటూంటే ఫైనాన్స్ డీ.యం.డి వేలా యుదంపిళ్ళై "అవవ్! రావాల్సిన యింటే ఆ యన్జూసుకుంటారు. యిట్లాంటి చాకిరీ మనగ్గడతాడు" అన్నాడు. అని నశ్యం ఓ పట్టు పట్టాడు. పర్సనెల్ డీ.యం.డి సూర్యనారాయణమూర్తి ఏ మ్మాట్లాడకుండా పని చేసుకుపోతున్నాడు; చాటూనే ఈ మాటలుగాని 'యముడి' గారి ముందు అంతా నక్కవినయమే కదా!' అని తలచి.

"రావ్ సాబ్! మన యం.డీ.ని మనం తిడుతున్నాంగాని నాల్గుకోట్ల నష్టంల వున్న కార్పొరేషన్ను పదికోట్ల లాభానికి ఆయనే తీసుకొచ్చాడు కదయ్యా! అగ్గిబరాటా అయ్యేయసాపిసరని ఆయన్ని వూరికేనే పిలుస్తున్నరా?" అన్నాడు ఆగమయ్య. ఈ అనందం యం. డీని

సమర్థించడానికి కాదు. టెక్నికల్ శ్రీనివాసరావును ప్రేరేపించి యింకా యింకా బూతులు తిట్టిద్దామని. ఆగమయ్య ఈ కార్పొరేషన్ పుట్టుకనుండి వున్నాడు దీనితోనే పెర్గుతున్నాడు. మొదటి నిండి యం. డీ. ని ఎవరైనా తిడుతుంటే కర్ణపేయంగా వుంటుందతనికి. కాని తను మాత్రం తిట్టడు.

ఇంటర్‌కామ్ 'గయ్యి' మంది. ఆగమయ్య ఫోనెత్తి "ఎసెస్ వస్తున్న" నని ఫోను పెట్టేసి, "సార్ పిలుస్తున్నడు వెళ్ళొస్త" నంటూ లేచాడు.

స్ప్రింగ్‌డోర్ తీసుకుని యం. డీ గదిలో ప్రవేశించగానే యాభయ్యేళ్ళ ఆగమయ్యకు చలేసి వణుకుపుట్టసాగింది. 'తనగదిలో ఏర్‌కూలర్‌కీ, ఈ గదిలో ఏర్‌కండీషనర్‌కీ ఎంత తేడా! గాడిద గాడిదే గుర్రంగుర్రమే అనుకున్నాడు. వెళ్ళి యం. డీ ముందు కూర్చున్నాడు.

ఆ కార్పొరేషన్‌లో అందరి చేతా యముడని పిలవబడే యం.డీ రవి ప్రసాద్ ఆగమయ్య ఆగమనాన్ని పట్టించుకోకుండా తన రివ్వాలింగ్‌చేర్‌లో వెనక్కిచేరగిలపడిపోయి ఏదోకాగితాన్ని శ్రద్ధగా చదువు కుంటున్నాడు.

'సర్ ఎందుకు పిలిచారు' అనే ధైర్యం లేక కుర్చీలో యిరుగ్గా కదులుతూ పొడిగా దగ్గాడు ఆగమయ్య.

"ఆగమయా! సామ్‌సన్ గ్రూప్ వాళ్ళ బిల్సు సెటిల్‌చేయమని పోయిన వారమే చెప్పాను. ఏంచేసారు?" ఖంగుమని మ్రోగే గంభీర స్వరంతో కాగితంలోకి చూస్తూనే అన్నాడు రవిప్రసాద్.

'మహా అయితే తన పెద్దకొడుక్కున్న వయస్సుండొచ్చు ఈయనకి. మిస్టర్ ఆగమయా అనైనా పిలవకూడదా? అని ఓవైపు బాధపడుతూనే "ఫైనాన్స్‌కి పంపించాను సార్! ఈ రెండ్రోజుల్లో చేసేద్దాం" అన్నాడు చేతులు కట్టుకుని.

రవిప్రసాద్ ఒక్క ఉదుటున లేచాడు చేర్‌లోంచి. చేతిలో కాగితం టేబుల్ మీదకు విసిరాడు. అంతకన్నా వేగంగా నిల్చున్నాడు ఆగమయ్య; మరీ పెద్దదయిన యం.డీ.గారి టేబుల్ మీద బోర్లాపడిపోయి కాగితాన్నందుకున్నాడు. "వ్వాట్?! వాళ్ళు మళ్ళీ రిమైండర్ రాసారు. నా కిట్లాంటివి నచ్చవని నీకు తెలుసు. పిళ్ళేకు చెప్పి వెంటనే చెక్కులు తయారు చేయించమను." అన్నాడు రవిప్రసాద్ మండిపడుతూ. అపుడే సిటరెట్టు ముట్టించుకున్నాడు.

"ఎస్సర్! మీరు ఢిల్లీ నుండి వచ్చేవరకు...."

"నో" అరిచాడు. "నేను చెక్కుల మీద సంతకంచేసే యింటికి వెళ్ళేది. వాయిదా వేయడానకి వీల్లేదు. తెల్సిందా!" అని కూర్చుని బెల్ నొక్కాడు. పిళ్ళేని పిలిచి దులుపుతాడేమో, ఆ అరవ్వాడి కావరం బాగా వంచుతాడేమో' నని ఆశించాడు ఆగమయ్య.

అటెండర్ రాగానే "పియ్యేనిపిలువు" అని పురమాయించి, "యూకెన్‌గో" అన్నాడు ఆగమయ్యను. అక్షరాలు కన్పించడం మానినా కాగితంలోకిచూస్తూ బయటపడ్డాడు జే. యం. డీ.

* * *

గోడగడియారంలో పదకొండు గంటలు ఖన్‌ఖన్‌మని మ్రోగాయి. అంతసేపు డ్రాయింగ్‌రూం సోఫాలో కూర్చుని ట్యూబ్‌లైటు వెలుగులో తాజా ఆంగ్ల, తెలుగు వారపత్రికలన్నీ నాలుగోసారి తిరిగేసింది సుచరిత. బయట ఎదోకారు చప్పుడైతే లేచి కిటికిలోనుండి రోడ్డుమీదకు చూసింది. ఎవరింటికో.

పత్రికలు యింకా తిరిగేయాలని పించక వరండాలోకి నడిచింది. బయట 'జానీ' తోకాడిస్తూ పోర్టికోలో కారుచుట్టూ తిర్గుతోంది. పోర్టికోలైటులో పూల కుండీలు చూస్తూ మెట్లమీద నిలుచుంది సుచరిత.

....తను కాలేజీనుండి నాలుగ్గంటలకే యిల్లు చేరుకుంటుంది. కారు పంపిస్తే సెంటాన్సునుండి మృదుల, పబ్లిక్ స్కూల్‌నుండి రాహుల్ వస్తారు. తనూ ఆయా కుస్తీపడి వాళ్ళకు బట్టలువేసి టిఫినూ హార్లిక్సూ యిస్తారు. యింటి ముందు గార్డెన్‌లో వాళ్ళు ఆడుకుంటుంటే చూస్తుంటారు. ఒక్కోసారి పిల్లల్ని ఆయాతో ప్రక్కనే పబ్లిక్ పార్కుకి పంపించి గార్డెన్‌లో తనొకతే కూర్చుని రేపటి క్లాసులకు ప్రిపేర్ అవుతుంది. యింకా టైముంటే తన రిసెర్చి పుస్తకాలు చదువుకుంటుంది.

పిల్లలు ట్యూషనయిపోగానే, ఆయా వాళ్ళకు భోజనాలు పెడుతుంటే పర్యవేక్షిస్తుంది. తొమ్మిది ఘంటలకల్లా పిల్లల్ని పడుకోపెడుతుంది ఆయా. "వారెపుడు వస్తారో నువ్వు తినేసి పడుకో" మని అనడమే తరువాయి ఆజ్ఞాపాలనచేస్తుంది ఆయా.

యింకప్పటినుండి రవికోసం ఎదురు చూస్తూ యింట్లో తనూ, యిల్లు కాపలా కాస్తూ బయట జానీ. ఏకారు చప్పుడైనా తను రోడ్డుమీదకు చూస్తుంది. ఏ ఆకు కదిలినా 'భౌభౌ' మని అరుస్తుంది జానీ.

సుచరితకు బయట గార్డెన్‌లో కాసేపు అలా తిరగాలనిపించింది. కాని "పోనిద్దూ బోర్" అని వెనక్కు తిర్గి డోర్ వేసింది. డ్రాయింగ్‌రూంలో లైట్ తీసేసి డైనింగ్ టేబుల్‌వైపు నడిచింది.... వంటావిడ రోజూ చేసే వంటలతోపాటు యివ్వాళ తనుగా నిలబడి చికెన్‌ఫ్రై చేసింది.

"యివ్వాళ పెందలాడే వస్తాను. సాయంత్రం వెళుతూ కృష్ణస్వామీస్‌ను హలోఅని సినిమాకు పోదాం. మంచి సినిమా సెలక్టుచేసి టిక్కట్లు తెప్పించు. ఓకే" అని అతనుగా చెప్పాడు రవి.

యీపాటికి సినిమా చూసొచ్చి తియ్యటి కబుర్లు చెప్పుకుంటూ డిన్నర్ చేస్తుండాలి. కాని ఏదీ?!


ఎనిమిది ఘంటలకు ఆఫీసుకు ఫోన్ చేస్తే, "సారీ డార్లింగ్! చాలా బిజీగా వున్నాను. రేపు ఢిల్లీ వెళ్ళాలి. నాల్గు రోజుల కాన్ఫరెన్సు. మినిస్టరుగారు వెళ్లాల్సింది, ఆయన మిసెస్‌కి బావుండక నన్ను వెళ్ళమన్నారు. అక్కడ ప్రజెంట్ చేయడానికని ఓ పేపర్ ప్రిపేర్ చేస్తున్నాను.... బైదిబై నా సూట్‌కేసదీ సర్దించు. నాల్గురోజుల ట్రిప్పే... నాకు ఆలస్యమవుతుంది. నువ్వు భోంచేసి పడుకో. ఓ.కే." పురమాయించాడు రవి. జవాబు వినకుండానే ఫోను పెట్టేసాడు.

అంత పెద్ద డైనింగ్‌టేబుల్ ముందు తనొక్కర్తే ఎలా భోంచేసేది? 'ఏ రాత్రికి వస్తారో, ఎందుకీ పిచ్చి నిరీక్షణ' అనుకుని స్పెషల్స్ తీసి ఫ్రిజ్‌లో పెట్టింది. దాహంగా ఉంటే ఆపుల్ జ్యూస్, నీళ్లూ కలుపుకుని త్రాగింది.

ఆపుల్ జ్యూస్ సీసా ఫ్రిజ్‌లో పెడుతుంటే జానీవాకర్ విస్కీ కనిపించింది. రోజూ ఏ రాత్రికోగాని రాడు రవి. 'టై' వదులు చేసుకుని ఓ రెండు పెగ్గుల విస్కీ సేవిస్తాడు. తన బలవంతంమీద భోజనం అయిందనిపిస్తాడు. మూడుంటే ప్రణయం, లేకపోతే 'కాంపోజు' వేసుకుని పడుకుంటాడు.

ఉదయం ఎనిమిది ఘంటలకల్లా టై బిగించినాడంటే ఆఫీసు తప్ప మరేదీ కనిపించదూ వినిపించదు. తివిరితే యిసుమున తైలమొచ్చినా అతడి పెదాల మీద చిరునవ్వు రాదు.

ఫ్రిజ్ మూసి, పిల్లల గదిలోకి వెళ్ళింది. మృదుల కప్పు సవరించి రాహుల్‌వేపు చూసింది. పాలు చీకుతున్నట్టుగా పెదాలు కదలిస్తున్నాడు. పిల్లల రెండు మంచాల మధ్యన క్రింద పడకవేసుకొని గురక పెడుతోంది




ఆయా. పిల్లలు తనను 'మమ్మీ' అని ఆయాను 'ఆయా'ని పిలిచినా వాళ్ళకు ఆమె మీదనే చనువూ, స్వతంత్రమూ.

....మృదులకు కొన్నాళ్ళు తనే పాలిచ్చింది. ఓనాడు రవి చూసి మండిపడ్డాడు. "డోంట్ బి సిల్లీ అండ్ రస్టిక్. ఆయాను పాలు పట్టమను. ఇదంతా మిడిల్‌క్లాసు నాన్సెన్సు. నేను సహించలేను."

అంతే, పిల్లలను 'కన్న' తల్లిగానే వుండిపోయింది.

ఎన్నడయినా పిల్లల్తో గడుపుతూ రవిపిలుపు వినిపించుకోకపోతే "చూడు డియర్! నేను యిల్లు చేరేది యీ సెంటిమెంట్సు చూడ్డానికి కాదు. పిల్లల్ని ఆయాకు వదిలేసి నాకేం కావాలో చూడు. బీ మై గుడ్‌వైఫ్" అంటాడు నిష్కర్షగా.... ఏ రాత్రయినా పిల్లల ఏడుపు వినిపించి బెడ్‌నుండి లేవబోతే, "ప్రతిదానికీ నువ్వే అయితే ఆయానెందుకు పెట్టుకున్నట్టు" అని విసుక్కుంటూ వారిస్తాడు. కావాలని అతడి నిద్రను భంగపరుస్తున్నట్టు భావిస్తాడు.

పాపం! పిల్లలకు డాడీ ప్రేమంటే ఏమిటో తెలియదు. డాడీతో ఎన్నడూ ముద్దుమాటలు చెప్పి ఎరగరు.

వీళ్ళు పుట్టకముందు రవి జిల్లా కలెక్టరుగా చేసాడు. తనూ అతనూ వెళ్ళి చాలా అనాథాశ్రమాలు, హాస్టళ్ళు సందర్శించేవారు. ఫోటోగ్రాఫర్లు ఫ్లాష్‌లు తీసినకాలదీ రవి అక్కడ చిన్న పిల్లల్ని ముద్దాడుతూ పోయేవాడు....

అట్లాంటివాడు, యివ్వాళ తన పిల్లల్ని ముద్దాడుకునే మూడూ, సమయమూ లేకుండా తయారయ్యాడు.

అయినా తన పిల్లల్ని ముద్దాడుకుంటే పత్రికల్లో వేయరు గదా!....

బెడ్‌రూంలోకి వచ్చి సోఫాలో కూర్చుని టీపాయ్‌మీద ఏర్ టికట్ కనిపిస్తే చూసింది....అవును, నిన్నగాక మొన్ననే గదా రవి బొంబాయి నుండి తిరిగి వచ్చింది. మళ్ళీ అపుడే ఢిల్లీ. నాలుగు రోజుల్లో వచ్చి నాలుగు రోజులేగా వుండేది. పదిహేనున జపాన్ ట్రిప్....పాపం! యీ కార్పొరేషన్ను ఉద్ధరించి లాభాలు తీసుకురావాలని ఎంత అవస్థపడుతున్నాడు. అభివృద్ధి చెందని జిల్లాలూ మునిగిపోతున్న కార్పొరేషన్లేనా ఇతడి జీవితం? తనకో పెళ్ళామూ, పిల్లలూ వున్నారనే ధ్యాసైనా వుండకూడదా??

అవును, రవి యింటిని గురించి ఎందుకు పట్టించుకుంటాడు?! ఏ రాత్రి వచ్చినా 'వార్మప్' చేయడానికి

ఫ్రిజిడేర్‌లో విస్కీ బెడ్‌రూంలో తనూ ఎదురుచూస్తుంటారు గదా!

ఎర్ టికెట్ టీపాయ్‌మీద పెడుతూంటే సుచరితకు సినిమా టిక్కట్లు తగిలాయి. వేడిగా నిట్టూరుస్తూ టిక్కట్లు పరపరా చించేసింది. బెడ్‌లో వచ్చి పడుకున్నాక ఆమెకు రవితో పరిచయమూ వివాహం రోజులు జ్ఞాపకం వచ్చాయి.

....రవిని తను మొదటిసారిగా హరి అన్నయ్య క్లాసుమేటుగా చూసింది. తను బి.యే. ఫైనల్లో ఉన్నపుడు వాళ్ళు ఇంగ్లీషు లిటరేచర్ యమ్మే ఫైనల్లో ఉన్నారు. పరీక్షలకు చాలా ముందే రవికి గోల్డుమెడల్ ఖాయమని అన్నయ్య విర్రవీగుతుండేవాడు. రవి ఎపుడు కనిపించినా ఏదో పుస్తకం చదువుతూనో గంభీరంగా ఆలోచిస్తూనో ఉండేవాడు. అప్పుడు....అతని గాంభీర్యమే తనకు నచ్చింది. కాలేజీ మీటింగుల్లో, పోటీల్లో అతను ఇంగ్లీషులో ధారాపాతంగా ఉపన్యసిస్తూవుంటే అతనిపై మరులు పెంచుకోకుండా వుండలేకపోయింది.

అంతా అనుకున్నట్టుగానే గోల్డు మెడల్ సాధించాడు రవి. తన మనసులో మాట చెబితే అన్నయ్య వెళ్ళి అతడి అభిప్రాయమడిగాడు. "నేను ఐ.ఏ.ఎస్. అవందే పెళ్ళిచేసుకోను. అంతదాకా ఆగగల్గితే ఓకే" అన్నాడు. తను ఆగింది. అయ్యేయస్ అయింతర్వాత పెళ్ళయింది. అతను ట్రైనింగు అయి వచ్చేవరకు తను ఎమ్మే పూర్తిచేసింది.

ఏడేళ్ళు జిల్లాలో కలెక్టర్ రవిప్రసాద్ భార్యగా అతనివెంట ఆభరణమై తిరిగింది. మృదులనూ, రాహుల్‌నూ కన్నది.

ఐదేళ్లుగా హైద్రాబాద్‌లో. శాంతినగర్ స్వంతయింట్లోకి రెండేళ్ళ క్రితమే మారారు. అన్నయ్య ప్రోత్సాహం, నాలుగేళ్లుగా ఉమెన్స్ కాలేజీలో పని చేస్తున్నది. ఇలా లెక్చరర్‌గా చేరాలనుకుంటున్నానని రవితో చెప్పినప్పుడు అతను ఒకటే మాటన్నాడు, "నా గుడ్ వైఫ్‌గా నీ బాధ్యతల కంతరాయం రానంతవరకూ నువ్వే జాబ్‌చేసినా నా కభ్యంతరం లేదు" అని.

"అయితే గడ్‌వైఫ్‌కేనా బాధ్యతలు? గుడ్ హజ్బెండ్ కేమీ ఉండవా??" అలా అడిగే ధైర్యం తన కెక్కడిది! అధికార దర్పాన్ని వెంటేసుకుని యిల్లు చేరి పెళ్లాన్ని సబార్డినేట్‌గా భావించే భర్తను ఏమని అడగ్గలదు? కోపాన్ని దిగమింగుకోవటం, ఎక్కడికక్కడ అతనితో సర్దుకుపోవటం తప్ప తనెప్పుడూ అతని మీద కోపించలేదు.

పైగా తెల్లవారిందంటే, ఏ వస్తువయినా దాని 'ప్రాపర్ ప్లేస్' లో లేకుంటే, రవి చిర్రుబుర్రు లాడుతాడు. అవును, అతనికి వస్తువులూ, మనుషులూ ప్రాపర్ ప్లేస్‌లో వుండాలి. అతను మండిపడుతూంటే తను 'డిఫెన్సు' లో పడి అతన్ని చల్లారుస్తూ వుండాలి.

ఇంట్లో ఏ పండగా పబ్బమూ కనీసం తమ వెడ్డింగ్ డేనైనా పట్టించుకోడు.

మూడేళ్ళ క్రితం....హరి అన్నయ్యా వదినా బలవంత పెడుతుంటే తమ వివాహ దినోత్సవాన్ని నాగార్జునసాగర్‌లో గడపటానికి ఒప్పుకున్నాడు రవి.

కాని వెళ్ళిన సంతోషం ఎంతోసేపు నిలవలేదు. ఆ మధ్యాహ్ననికి వ్యాను నిండా ఫైళ్లు వచ్చాయి. ఇంకప్పటినుండి సర్క్యూట్ హౌస్‌లో ఆఫీసు పెట్టేసాడు రవి.

"ఏమిట్రా పూర్తిగా మెకానికల్ అయిపోయావు. నువ్వీ రెండు రోజులు విశ్రాంతి తీసుకుంటే స్వర్గాలేమన్నా పడిపోతాయా, లేక ఫైళ్లు లేచిపోతాయా?" అని మందలించాడు హరి.

"ఆ మాటే నేనూ అంటాను. మనం విశ్రాంతి తీసుకోకుంటే స్వర్గాలేమన్నా వూడిపడతాయా అని. చూడు హరీ! మన తత్త్వాలు వేరు కాబట్టే నువ్వు యూనివర్సిటీతో చేరావు. నేనీ లైనుకు వచ్చాను. ఎవరి పిచ్చి వాళ్ళ కానందం. ఒకే" అని సంభాషణ త్రుంచేసాడు రవి.

రాత్రి డిన్నర్ చేస్తున్నప్పుడు మళ్ళీ విషయాన్ని కదలించాడు హరి. "చూడు రవీ! బయట ఆ వెన్నెల; ఆ అందాలూ, ఆనందాలు. నువ్వు ఫైళ్ల లోకంలో పడితే ఈ ప్రకృతి రామణీయకత నెలా చూస్తావు? ఏ ఆనందమూ లేకపోతే మనుషులకీ మెషీను చక్రాలకీ తేడా యేమిటి? నీకు చెప్పగలవాణ్ణి కాక పోయినా నా కనిపిస్తున్నది. నువ్వు కళాత్మక హృదయాన్ని పడుకోబెట్టి ఎప్పుడూ ఆఫీసు గొడవల్లోనే పడిపోయి నీ వ్యక్తిత్వాన్నే లాప్‌సైడెడ్ చేస్తున్నావని."

తింటున్నప్పుడు మాట్లాడడు కనుక రవి భోజనం పూర్తయేదాకా హరి మాటలకు జవాబివ్వలేదు. మూతి తుడుచుకుని, "సీ డియర్! ఈ ప్రకృతి అందచందాలు చూసే తీరిక నాకు లేదు. అయాం ఆంబిషియస్. నేను పెరగాలి. యింకా యింకా పెరిగి రవిప్రసాద్ లేనిదే ప్రభుత్వ మెలా నడుస్తుంది అనేంత ఇన్‌డిస్పెన్సబుల్ కావాలి.... ఇది లాప్‌సైడెడ్ డెవలప్‌మెంటని కదూ నువ్వనేది. అది నీ అభిప్రాయం.... ఏమైనా నా ఫైళ్ళ గురించిన చర్చ ఇంతటితో ముగిద్దాం. ప్లీజ్ లీవ్ మీ అలోన్" అంటూ బయటకు నడిచాడు. అతను ఫైల్ క్లోజ్ అన్న తర్వాత చర్చించేదేముంది యిక....

సుచరిత బెడ్‌లో అసహనంగా కదలింది. ఆమెకు నిద్ర రావటంలేదు. బెడ్‌లైట్ చిరువెలుగే దానికి కారణమన్నట్టు ఆర్పేయాలని లేచింది. "ఖన్" మని గడియారం మ్రోగితే సమయం ఏ

పదకొండున్నరో అనుకుంది. చేతి గడియారం చూస్తే ఒంటిగంట. తేదీ, దినమూ మారిపోయాయి. యింకా మేల్కొవటం బావుండదని లైట్ తీసేసి చిమ్మచీకటిలో పడుకుంది. ....కన్నంటుకుంటుండగా కాలింగ్ బెల్ వినిపించింది. సుచరిత లేస్తున్నంత లోనే ఆయా లేచి తలుపు తీసింది. రవి ఇంట్లోకి వచ్చాడు.

సుచరిత కళ్లు నులుపుకుంటూ వచ్చింది. అతనేమీ మాట్లాడకుండా బట్టలు మార్చుకుని వాష్ చేసుకుని వచ్చాడు. "వడ్డించమంటారా" అంది డైనింగ్ టేబుల్ సర్దుతూ. "ఆకలి లేదు. కారంగా ఏమైనా ఇవ్వు" అని విస్కీ నీళ్ళలో కలుపుకు తాగుతున్నాడు. చికెన్ ఫ్రై ప్లేటులో పెట్టియిస్తే "ఓహ్. స్పెషలన్నమాట. థాంక్యూ" అంటూ తినసాగాడు. 'నువ్వు తిన్నావా' అని అతడడగలేదు. 'నాకూ ఆకలిగానే వుంది' అని ఆమె చెప్పలేదు.

"నాకో కాంపోజు టాబ్లెట్ యిచ్చి పడుకో" అన్నాడు బెడ్రూంలోకి వచ్చాక. టాబ్లెట్ యివ్వగానే వేసుకుని "గుడ్ నైట్" అని చెప్పి అటువేపు తిరిగి చక్కా నిదురపోయాడు. బెడ్లైట్ వేపుచూస్తూ నిదురకోసం ఎదురుచూస్తున్నది సుచరిత.

* * *

జే.యం.డీ. ఆగమయ్య,డీ.యం.డీలు యితర కార్పోరేషన్ ఆఫీసర్లు ఒకరి వెనుక వొకరు కార్పోరేషన్ కార్లు వేసుకుని యం.డీ గారితో 'బ్రీఫింగ్' తీసుకోవడానికి ఎనిమిది గంటలకే వచ్చారు. తొమ్మిదిగంటలకల్లా యం.డీ. గారి ఏర్కండీషండ్ చెవర్లెట్ తీసుకొచ్చి పోర్టికోలో వుంచి ఠీవిగా బీడీ తాగుతూ నిలుచున్నాడు డ్రైవరు.




ఆఫీసర్ల కార్లన్నీ రోడ్డుమీద పార్కు చేసారు.

బ్రీఫింగ్ పూర్తికాగానే ఆఫీసర్లంతా వరండాలో వచ్చి కూర్చున్నారు నిశ్శబ్దంగా.

బ్రేక్‌ఫాస్టు చేసి బయటికి నడుస్తూ "సో బైబై డార్లింగ్! సీ యూ" అన్నాడు రవి. "నేనుకూడా వస్తున్నాను, మీకు సెండాఫ్ యిచ్చి కాలేజీకి వెళతాను" అన్నది వెనకే నడుస్తూ సుచరిత. అతడు ఎక్కడికి వెళ్ళినా సెండాఫ్ యివ్వటం అలవాటు చేసుకుంది.

ఫ్లైట్ గానీ ఆలస్యమయితే కాసేపు అతడితో కబుర్లు చెప్పుకునే అవకాశం దొరుకుతుందనే ఆశ. "వై డూ యూ బాదర్" అని ఆక్షేపిస్తూనే "ఓకే" అంటూ వరండాలోకి వచ్చాడు రవి.

ఆఫీసర్లంతా చేతులు కట్టుకుని నిలుచున్నారు. ఆగమయ్యైతే వినయంతో నాట్యమే చేస్తున్నాడు. అతనే పరుగున ముందు నడచి కారు డోర్ తెరచి పట్టుకున్నాడు. యం.డీ. గారు ఎక్కగానే డోర్ వేసాడు. చెవర్లెట్ మెత్తగా పరుగెడుతుంటే ఆఫీసర్ల కార్లన్నీ అనుసరించాయి. ఆ 'మోటార్‌కేడ్' వేపు చూస్తూ నిలుచున్నది సుచరిత. రవి కలెక్టరయిన్నాటి నుండి చూస్తున్నది, ఎటు బయలుదేరినా అతడి కారు వెనక మరో నాలుగైదు ప్రభుత్వ వాహనాలు తప్పవు.

ఆయాకు తలుపేసుకోమని చెప్పి ఫియట్ డ్రైవ్‌చేస్తూ సుచరిత ఏర్‌పోర్టు వేపు సాగింది.... మోటార్‌కేడ్ చాలా వేగంగా వెళ్ళిపోయినట్టుంది, ఎంత వేగంగా వెళ్ళినా చివరి కారయినా కన్పించడంలేదు. అవును, రవి కారులో




కూర్చున్నాడంటే ఆఘమేఘాలమీద తీసుకుపోవాలి కారు. బాగా నిపుణుడయిన డ్రైవరయితేనే అతని కారు నడపడానికి నిలుస్తాడు. ప్రొద్దున అతడి బ్రీఫ్‌కేసు సర్దుతూ చూసింది. 'సోషలిస్టు సమాజ స్థాపనకు ప్రభుత్వ కార్పోరేషన్ల పాత్ర'; అంగ్లేయంలో చాలా పెద్ద పేపరే వ్రాశాడు రవి. వేగంగా ఢిల్లీ చేరుకుని తన పేపరు చదివేయాలనే ధ్యేయం: అవకాశమే వుంటే ఓ ప్లేనైనా చార్టర్ చేసుకుని వెళ్ళిపోగలడు....

కారు టాంకుబండుమీద వెళ్తూంటే - గాలి చల్లగా సోకి మనసు ప్రపుల్లమయిపోయింది ఆమెకు. యింకా ప్లేనుకి గంటన్నా టైముంది. మళ్ళీ ఆఫీసర్లకు ఓ అరగంట బ్రీఫింగ్ యివ్వందే రవి వదలడని తెలుసు. ఆ దర్బారులో వాళ్ళమధ్య తనుండటం ఎబ్బెట్టుగా వుంటుంది. అందుకే స్పీడు తగ్గించి హుసేన్‌సాగర్ చల్లని స్పర్శ నానందిస్తూ కారు నడిపింది సుచరిత. డెభ్భయ్యేనభయి కిలోమీటర్ల వేగంలో వెళ్ళిపోతున్న కార్లను చూసి "రాట్ రేస్" అని సానుభూతి పడింది.

కారు పారడైజు దాటి రేస్‌కోర్సు మలుపు తిరగబోతున్నది.... అంతే....

సడన్‌గా కారునాపేసి దిగి "గ్గాడ్! ఏమయ్యింది" అనరుస్తూ పరుగెత్తింది సుచరిత.

ఏ.సి. చెవర్‌లెట్ వెనకడోరు విరిగి రోడ్డుప్రక్కకు పడివుంది. ముందు భాగమంతా నజ్జునజ్జు అయి తుపాకి దెబ్బతిని పడిపోయిన బెబ్బులిని తలపిస్తున్నది. అల్లంత దూరాన ముందు భాగం అద్దాలు పగిలి నేరస్తుడిలా నిలుచుంది లేలాండు లారీ.

సుచరిత చెవర్‌లెట్ వెనక సీట్లోకి చూసింది. రక్తం చాలా కనిపిస్తున్నది. రవి ఏమయినట్లు???

ఆమెకు దుఃఖం ముంచుకొచ్చి ఏడుస్తుంటే పోలీసు ఇన్స్‌పెక్టరు ఒకరు వచ్చి "వార్ని ఉస్మానియాకు తీసుకుపోయారమ్మా" అని చెప్పాడు. ఫియట్‌లో కూర్చుని ఎంత స్పీడుగా నడిపించినా ఆమెకు తప్పనిపించలేదు.

హాస్పిటల్లో దిగి కాజువాలిటీకి పరుగెట్టింది.

స్ట్రెచర్ మీద పడుకుని వున్నాడు రవి. కళ్లుతెరచి చూస్తున్నాడు. అతడి ప్రక్కన వేరే స్ట్రెచర్‌లమీద పి.యే., జవానూ అపస్మారకంగా పడివున్నారు.

రవిని చూస్తూనే సుచరితకు ఏడుపొచ్చింది. ఏడుస్తూ "ఎందుకిలా జరిగింది" అనడిగింది. రవి కళ్ళు దించుకున్నాడు. దూరంగావున్న ఆగమయ్య ఆమె దగ్గరకు వచ్చి, "కార్నర్ తిరుగుతుంటే కారును లారీవచ్చి గుద్దిందమ్మా. పాపం! డ్రైవరు అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. పి.యే.కూ జవానుకూ ప్రమాదమైన దెబ్బలు తగిలాయి. మీ అదృష్టం, సార్ కుడి కాలుకూ, చెయ్యికీ మాత్రమే దెబ్బలు తగిలాయి" అని లారీది ఎలా రాంగ్ సైడో, ఆ డ్రైవరును పోలీసులు ఎలా పట్టుకున్నారో వివరిస్తున్నాడు. సుచరిత చూసింది. రవి కుడిభాగమంతా రక్తసిక్తమైవుంది.

రవికి చాలా అయోమయంగా వున్నది. ఈపాటికి తను ప్లేనులో వుండాల్సింది; కదలలేకుండా స్ట్రెచర్‌మీద పడుకున్నాడు. ఝామ్మని సాగిపోయే తన కారును, ఒక థర్డ్‌క్లాస్ ఫెలో గుద్దేశాడు. తన ప్రయాణాన్నే మార్చేశాడు.

* * *

ఆర్థోపెడిక్స్‌లో విరిగిన చేతికీ, కాలుకూ కట్లు కట్టి పేయింగ్ రూంలో పడుకోబెట్టారు రవిని. మధ్యాహ్నం సర్జన్ వస్తే రవి బెడ్‌లో కూర్చోబోయాడు.

"కదలకండి. మీరు అదే పొజిషన్‌లో పడుకోవాలి. కదిలితే ఎముకలు సరిగ్గా సెట్‌కావు" అని వారించాడు సర్జన్. "డాక్టర్! యింకెన్ని రోజులీ శిక్ష" బాధ పడుతూ అడిగాడు రవి.

"మిస్టర్ రవీ! మీ కాలూ చేయీ చాలా చోట్ల విరిగిపోయాయి. ఎముకలు చాలా దెబ్బతిన్నాయి. కనీసం ఓ ఆరు నెలలయినా మీరు విశ్రాంతి తీసుకోందే ఎముకలు కుదురుకోవు. మీరేమాత్రం అశ్రద్ధచేసినా కాలూ చేయీ పాడవుతాయి. యింకా చెప్పాలంటే తీసేయాల్సి వచ్చినా రావచ్చు. సో బీ కేర్‌ఫుల్."

రవి చాలా కృంగిపోయాడు. ఆరు నెలలు తను లేకుండా .... ఢిల్లీ కాన్ఫరెన్సు, జపాన్ ట్రిప్ ...., కార్పొరేషన్‌లో యింకా చాలా చేయాలనుకున్నాడు. అవన్నీ ఏం కావాలి?!.... ఒక్కటంటే ఒక్క రోజు విశ్రాంతి దొరకలేదు యిన్నాళ్ళు. అలాంటిది ఆరునెలలు!!....

సాయంత్రం మినిష్టరుగారు, సెక్రటరీ యింకా ఆయన యితర వందిమాగధులను వెంటబెట్టుకొని వచ్చారు. 'సారీ రవిగారూ! మీరలా పడిపోవడం నా డిపార్ట్‌మెంట్‌కెంత దెబ్బో చెప్పలేను. పనులన్నీ ఎలా జరగాలి?' అని విచారపడతాడనుకున్నాడు. 'ఫైల్సు యిక్కడికే తెప్పించుకోండి. కార్పొరేషన్ మీరే గైడ్ చేయాలి' అని రిక్వెస్టు చేస్తాడనుకున్నాడు. కాని మినిష్టరుగారు కష్టమరీగా, కర్టెసీగా చూడ్డానికి వచ్చాడు. నోరు మెదపకుండా చూస్తున్నాడు.

రవి తనే కల్పించుకుని, "కాన్ఫరెన్స్‌లో మన స్టేట్‌కి రిప్రజంటేషన్ లేకుండా పోయెగదా! అయాం సో సారీ" అన్నాడు. "విచారించకండి రవిగారూ! మన జాయింట్ సెక్రటరీగార్ని కాన్ఫరెన్సుకి పంపించాను. ఇవ్వాల్టి నుండి కార్పొరేషన్‌కు యం. డీ. గా ఆయనే చార్జీ తీసుకున్నారు." యధాలాపంగా చెప్పారు మినిష్టరుగారు.

రవి అనుకున్నాడు. డ్రైవర్‌లా తనూ ఆక్సిడెంటులో చనిపోతే చిన్న సంతాప సభ తప్ప ఏం జరిగేది? ఏ మాగేది??

విజిటర్సు రావడం అయిపోయింది. యింకాసేపుండి హరి, ఆయన భార్య కావాల్సిన ఏర్పాట్లుచేసి వెళ్ళిపోయారు. గదిలో సుచరిత, రవి మాత్రమే మిగిలారు. "సారీ డియర్! నిన్ను శ్రమపెట్టాను. కాలేజీకి సీ.యెల్. పంపిచావు గదా?" అన్నాడు ఎపాలజిటిక్‌గా చూస్తూ రవి. "పంపించలేదు. రేపు లాంగ్‌లీవుకి అప్లయిచేస్తాను. లీవు యివ్వమంటే రిజిగ్నేషనిస్తాను" అన్నది సుచరిత అతని దగ్గరగా వచ్చి కూర్చుని.

"డోంట్ బి సిల్లీ! నన్ను చూసుకోవడానికి హాస్పిటల్లో స్టాఫుందిగదా! నువ్వెందుకు బాధపడ్డం".

"నో రవీ! నేను మిమ్మల్ని యీ స్థితిలో వదలి ఏ పనీ చేయలేను. మీరు బాగయ్యేవరకు నేను నార్మల్ మనిషిని కాలేను. బిలీవ్ మీ." అతడి తల వెంట్రుకల్లో వేళ్ళు పోనిచ్చి దువ్వుతూ అంది సుచరిత. హాయనిపించి తడిసిన కళ్ళు మూసుకున్నాడు రవి. అతడి తలను గుండెలకు హత్తుకుంది ఆమె.

ఆమె ఒళ్ళో తలపెట్టుకుని తను ఇన్నాళ్ళూ ఏం కోల్పోయాడో అర్థం చేసుకుంటున్నాడు రవి. అందని శిఖరాల్ని అందుకున్నాడు.



